# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-11-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దేశవ్యాప్తంగా 18 ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన ప్రధాన్ మంత్రి భారతీయ జనౌషధి కేంద్రాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు ప్రారంభిస్తారు.**
2. **ఆంధ్రప్రదేశ్‌లో 500 ఆధునిక బయోగ్యాస్ కేంద్రాలను రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయనుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.**
3. **ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఈరోజు నుండి తిరిగి ప్రారంభం కానున్నాయి.**
4. **జార్ఖండ్‌లో తొలి దశ శాసనసభ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ మరికొద్దిసేపట్లో ప్రారంభంకానుంది.**
5. **ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా ఈరోజు తిరుపతి నుంచి సికింద్రాబాద్‌కు దక్షిణమధ్య రైల్వే ప్రత్యేక రైలును నడుపుతుంది.**

==========================

దేశవ్యాప్తంగా 18 ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన ప్రధాన్ మంత్రి భారతీయ జనౌషధి కేంద్రాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ రోజు దృశ్య మాధ్యమం ద్వారా ప్రారంభించనున్నారు. పీఎంబీజేకే ప్రత్యేక కేంద్రాల ద్వారా ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన ఔషధాలను కేంద్ర ప్రభుత్వం అందించనుంది. సమాజంలోని అన్ని వర్గాల వారికి నాణ్యమైన ఔషధాలు అందుబాటులో ఉండేలా చూడటం ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణలోని కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన జనౌషధి కేంద్రాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించనున్నారు. రైల్వేస్టేషన్‌లో జరిగే కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి పాల్గొంటారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో 500 ఆధునిక బయోగ్యాస్ కేంద్రాలను రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయనుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి సమక్షంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ, రిలయన్స్ సంస్థలు నిన్న అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు మూడేళ్లలో పూర్తి కావాలని.. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహకారం అందిస్తామన్నారు. రిలయన్స్ పెట్టుబడులతో రాష్ట్రంలో 2.5 లక్షల

మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి వివరిస్తూ,

వాయిస్ ( 32 సెకన్లు)

-----------------------------

ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఈరోజు నుండి తిరిగి ప్రారంభం కానున్నాయి. శాసన సభ సమావేశాలలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ 2024–2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌ను సోమవారం సభలో ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్ పై ఈరోజు నుండి సభలో చర్చించనున్నారు. అనంతరం ప్రభుత్వం మూడు బిల్లులను శాసనసభలో ప్రవేశపెట్టనుంది. ఇద్దరికి మించి పిల్లలు ఉన్న వారు స్థానిక సంస్థల్లో పోటీకి అనర్హులు అన్న నిబంధనను తొలగిస్తూ పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాల్లో సవరణ చేయనున్నారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు సవరణ బిల్లును ప్రవేశపెట్టనున్నారు. 2023–24కి సంబంధించి కాగ్ నివేదికనూ సభ్యులకు అందజేస్తారు.. ఈ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 22వ తేదీవరకూ కొనసాగుతాయి.

-----------------------------

జార్ఖండ్‌లో తొలి దశ శాసనసభ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ మరికొద్దిసేపట్లో ప్రారంభంకానుంది. తొలి దశలో ఈరోజు 43 నియోజకవర్గాలకు పోలింగ్ జరుగుతుంది. వీటితో పాటు రాజస్థాన్‌లో 7 స్థానాలకు, పశ్చిమ బెంగాల్‌లో 6, అస్సాంలో 5, బీహార్‌లో 4, కర్ణాటక 3, మధ్యప్రదేశ్ సిక్కింలలో రెండు స్థానాలకు చొప్పున, చత్తీస్‌ఘడ్, గుజరాత్, కేరళ, మేఘాలయ రాష్ట్రాల్లో ఒక స్థానం చొప్పున ఎన్నికలు జరుగుతాయి. అలాగే కేరళలో వయనాడ్ పార్లమెంటు స్థానానికి ఉప ఎన్నిక ఈరోజు జరుగుతుంది.

-----------------------------

సామాజిక మాధ్యమాల్లో మహిళలను వేధించేలా పోస్టులు పెట్టడం, ప్రచారం చేయడం 'మెంటల్ వయలెన్స్' మానసిక హింసగా పరిగణించాలని భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో ఆమె నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేసే వారిపై సైబర్ క్రైం కింద ఫిర్యాదు చేస్తామన్నారు. బాధితులకు మానసిక స్థైర్యాన్ని కలిగించేలా సెమినార్‌లు నిర్వహిస్తామని ఆమె తెలుపుతూ,

వాయిస్ (28 సెకన్లు)

-----------------------------

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైలును నడుపుతోంది. ఈ రోజు తిరుపతి నుంచి సికింద్రాబాద్‌కు ప్రత్యేక రైలు నడపనున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు తెలిపారు. తిరుపతి–సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఈ రోజు రాత్రి తిరుపతిలో బయలుదేరి, రేపు ఉదయం సికింద్రాబాద్ చేరుకుంటుందని చెప్పారు. ఈ రైలు రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, గుంటూరు, సత్తెనపల్లి, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్లలో ఆగుతుందని ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని రైల్వే అధికారులు సూచించారు.

-----------------------------

మాదక ద్రవ్యాల వలన కలిగే దుష్ప్రభావాలపై యువత అవగాహనా కలిగి ఉండాలని విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టీ అన్నారు. విజయనగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహించిన "సంకల్పం"

కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందల్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపీనాథ్ జట్టీ మాట్లాడుతూ,

వాయిస్ (25 సెకన్లు)

---------------------------

భారత దేశ విద్యా రంగాన్ని సుసంపన్నం చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన జాతీయ విద్యా విధానం –ఎన్ఈపీకి అనుగుణంగా ఉండే కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమం ఉల్లాస్ నవ్ భారత సాక్షరతా కార్యక్రమం. దీనిని “న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం” అని కూడా పిలుస్తారు. 15 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయసు ఉన్న పెద్దలకు సాధికారిత కల్పించి విద్యా, నైపుణ్యాలను పెంపొందించడం ఉల్లాస్ కార్యక్రమ ముఖ్యోద్దేశం. ఈ కార్యక్రమంపై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం పది గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తా తీరాల వెంబడి కేంద్రీకృతమై ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో ఈరోజు, రేపు అక్కడక్కడా భారీ వర్షాలు, మిగిలినచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. బాపట్ల, ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. మరో వైపు తెలంగాణలోనూ ఈరోజు, రేపు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 116వ సంచిక ఈనెల 24వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 22వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

======================